

# "వింత మనస్తత్వం"



రచన :
బృందావనం రంగాచార్య

పంతులు దీర్ఘాలోచనలో మునిగివున్నాడు. అంటే అతనివిషయంలో ఇదేమీ ఆశ్చర్యకరమైన అంశంగాదు. పంతులు పంతులుగానే లోకానికి పరిచయమైపోయాడు గాబట్టి పేరుతెలుసుకోవాలనే కోరిక ఎవరికీ,ఎప్పుడూగూడా వుదయించలేదు.అతని శిరస్సు వక ఎడతెగని ఆలోచనల మందిరం. పంతుల్ని గురించి గ్రహించవలసిన ముఖ్యమైనభావమిది. పరిష్కారంగాని- కావడానికి వీలులేని- ప్రపంచాతీతసమస్య లెన్నిటికో పాపమతనిబుఱ్ఱ వసతి సౌకర్యాలు కల్పిస్తుంది. తెంపులేని ఊహల దొంతరలతో అతని మేధస్సు తుకతుక వుడికిపోవలసిందే. "మనకీ అనవసర చర్చలతో నిమిత్తమేమిటి?" అనే తత్వం అతనిలో కంచుకాగడాలుపెట్టి వెదికినా కన్పించదు.

అనుక్షణం కారుమేఘాలవంటి భావనలెన్నో తలలు విరబోసుకొని తాండవమాడుతుంటై అతని హృదయాకాశంలో. అంతేకాదు పందాలువేసుకొని పరుగులుదీస్తుంటై కూడా.

పునాదులతోసహా పెకలించివేసే తీవ్ర ప్రళయరూపంలో యెన్నో ఆలోచనలతని ఊహాసౌధాలపై అనుదినం అగ్నిపరీక్షలు చేస్తూనేవుంటాయి. వాటి అంతిమస్వరూపం యెట్టి విషమదశలోకి పరిణమించ నున్నప్పటికీ ఆదిలో వానికన్నింటికీ హృదయపూర్వక స్వాగతమిస్తాడు పంతులు.

"ఇదే నీవుచేస్తున్న తెలివితక్కువపని. ఇలాంటి విషయాలు మననం చేయడం దేనికి? పరిష్కారం కుదరలేదని బాధపడి బావురుమనడం దేనికి? నీశాంతిని నీవేభంగంజేసుకుంటున్నావు ఆనందపడ్డాలంటే సాధనం నీచేత్తిలోనే లేకపోలేదు" అని యెప్పుడైనా అంటే "అలాగైతే, ఊహలు అంతరించి మొద్దుబారడాని కేదైనా మందిప్పించి పుణ్యంగట్టుకోరాదూ." అనేవాడు పంతులు చాలా తీవ్రమైన ఆలోచన చూస్తూ.

పంతుల్ని ఉన్మాదిగాజేసి లోకం మీద వదలడాని కేమహాత్ముడూ ఒడిగట్టలేదు. కాబట్టి అతని ఊహలు అంతరించనూలేదు మెదడు మొద్దుబారనూ లేదు.

ప్రపంచాని కేదో పెద్ద ముప్పువస్తుందని, అక్కడ రాజకీయా లట్లావున్నాయనీ, యిక్కడరాజకీయా లిట్లావున్నాయనీ, అయనె సమస్యలు పెంచుకొని సతమత మౌతున్నాడు. ఆలోచనలు ఆపివేసినందున పంతులుకేదో ప్రమాదం వచ్చి నెత్తినబడిపోతుందే అనే అదుర్దా సన్నిహితు లెవ్వరిలోగూడా లేదు. అటువంటి అవివేకమైన తలంపు మరెవ్వరికీ కలగనుకూడా కలగదు.

పంతులి జీవితంలో ప్రస్తుతం ఇరవైఅయిదో వసంతం నడుస్తున్నది. చిన్నతనంలోనే పంతులి మూగనోము వెఱ్ఱిచూపుల వేదాంతం- అవిచ్ఛిన్నాలోచనా పరంపరలలో మునిగి తేలేనుదురు భాగం, చూచి గ్రామస్తులే కాక ప్రక్కపల్లెలవాళ్ళుగూడా యితడొక బాలయోగిగా మారబోతున్నాడని పాపం గొప్పగా ఆశపడ్డారు.

కాలంకర్మం కలిసిరాక పోబట్టిగాని, లేకపోతే యీ బాలయోగికి సమర్పించే కానుకలపై ఆధిపత్యం వహించడానికి గ్రామంలో వక కమిటీ వెలవడం తప్పనిసరి అయ్యేది. సదరు కమిటీలో సభ్యత్వం సంపాదించుకొనడానికి చుట్టుపట్టులనున్న గ్రామాలలో గల భక్తబృందం మధ్య భారీయేత్తున వార్షికంగా పోటీలు జరుగవలసిన అవసరం యేర్పడివుండి వుండేది.

అలాంటి అంతర్గామిణి వేదాంత రాద్ధాంతాలకు మాగ్రామంగాని పొరుగు గ్రామాలుగాని నోచుకోకపోబట్టి పదిహేడోయేడు వచ్చేసరికి పంతులు ట్రైనింగుస్కూలు విద్యార్థిగా మారాడు. అతనిలో బాలయోగిరూపాన్ని చిత్రించుకొంటున్నవాళ్ళందరికీ ఆ పరివర్తనం ఆశాభంగంగానే గోచరించింది. తరువాత యేమనుకుంటే యేంప్రయోజనం కాలప్రవాహం కావలసిన బాలయోగిని ట్రైనింగుస్కూలు గేటువద్ద ప్రక్కకు నెట్టి మాట్లాడకుండా ముందుకు సాగిపోయింది.

రెండు క్యాలెండర్లు కాలభిత్తికమీద అవతరించి, అదృశ్యమయ్యాయి. అటుపిమ్మట ... పంతులు రమణమహర్షి; వివేకానంద మొదలైన మహాత్ముల ఫోటోబతో గ్రామంలో ప్రవేశించి చాలామంది చేత హృదయపూర్వకంగా కొనియాడబడ్డాడు. తనలో యీషణ్మాత్రంగూడా మార్పులేదని ఋజువుచేసుకున్నాడు. ట్రయినింగు పాఠశాల పంతులి రెండు సంవత్సరాల జీవితంలో యేమాత్రపు చలనాన్నిగూడా సాధించలేక పోయిందని అర్థంజేసుకొనడానికి యెంతోకాలం పట్టలేదు.

అయితే పంతులి అంతస్తులోమాత్రం యేదో అపూర్వమైన వినూత్నతమాత్రం గోచరం కాసాగింది. అతనిపట్ల ప్రజలలో యేదో చెప్పలేని గౌరవం అభి

వ్యక్తం కావడం అరంభమైంది. అతనిలో గతంలో రేగిన ఆధ్యాత్మికపు మలయమారుతానికి ట్రయినింగ్ స్కూలు పరిమళాన్ని పులిమినట్లున్నది.

ప్రతివాళ్ళూ అతనివైపు పసికట్టి యేదో వాసనచూస్తున్నారు. పంతులు అధిష్ఠించిన పీఠప్రమాణం ఉన్నతంగా వున్నట్లు భావన లారంభమయ్యాయి.

ఆనాటినుండి పంతులి నాయకత్వం లేకుండా ఆ పరిసరాల్లో యేలాంటి సత్కార్యక్రమాలుకూడా సాగేవికావు. సాహిత్యసభల కధ్యక్షత వహించి సక్రమంగా నడిపించడం మొదలుకొని, సంఘసంబంధమైన కలహాలకు మధ్యవర్తిత్వం వహించి మంచిమంచి సలహాలివ్వడందాకా పంతులుకు పనిగా మారింది.

ఉన్నట్లుండి వక మంచిరోజున పంతులు పెండ్లికొడుకయ్యాడు. కొన్ని సంవత్సరాలైనా తిరక్కముందే పిల్లల తండ్రిగూడా కాక తప్పలేదు. అంతా బాగానే వున్నది. అయినా సమస్యలు తెగక మధనపడే మనస్తత్వం మాత్రం పంతులిమీద అధికారం చెలాయించడం మానేసినట్లు సూచనామాత్రంగా గూడా తోచడంలేదు.

అతనికి విశ్రాంతి సమయమనేది యెప్పుడూ వుండడానికి వీలులేదా అన్నట్లు తోచేది చూచేవాళ్ళకు. అసలు విశ్రాంతి—కనీసం మానసిక విశ్రాంతి నైనా పంతులు వాంఛిస్తున్నట్లు అతని ముఖ కవళికలనుబట్టి అర్థంచేసుకొనడానికి ఆస్కారంలేకుండా వున్నది.

మరీ! క్రమక్రమంగా అతనిమనస్సు విచిత్రనృత్యంచేయడం అరంభించింది. మనుష్యులతో పూర్తిగా సంబంధం తెగగొట్టుకొనడానికి పంతులి ఊహలు ఉబలాట పడుతున్నట్లు వ్యక్తం కాసాగింది. తెంపులేకుండాచేసే గ్రంథావలోకనానికి స్వస్తివాచకం గూడా పలికేశాడు. ఏకాంతవాసంలో గగనానికి శూన్యదృక్కులను రవాణాచేయడమే పంతులు యొక్క ప్రస్తుత సమస్తకార్యక్రమం

పంతుల్ని గురించి గ్రామంలో గల ప్రజలు పలువిధాలుగా విస్తుపోవడం అరంభించారు. చూస్తూచూస్తూ వెఱ్ఱిగా నిలువుగ్రుడ్లు పడిపోయే పంతులురీతిని చూస్తున్నకొద్దీ బడిపిల్లలుగూడా గుసగుసలాడుకొనడం అరంభించారు. పంతులు వింతవైఖరి అపూర్వంగా రేకులు విప్పుకొని త్రైతక్కల ద్రొక్క నారంభించింది. ఇటీవల అతనికి భార్యతో మాట్లాడడానికిగూడావక క్షణం వెచ్చించడం యిష్టంవున్నట్లు కన్పించడంలేదు. ఇది గ్రహించి వాళ్లవాళ్లు సన్నిహిత బంధువైయుండి ప్లీడరీ చదువు వక పంతులి స్నేహితుడిచేత కనకయ్యను మందలింపజేశారట.

తన లాయర్ విజ్ఞానాన్నంతా ప్రశ్నపరంపరలరూపంలో పంతులిమీద ప్రయోగించబోయి "దయచేసి తాము ప్లీడరీ చదువుతూన్నా; సమస్యను తర్కించుకొనేశక్తి యింకా అలవడలేదని గుర్తించండి." అన్న పంతులి సమాధానంతో ఆకాబోయే ప్లీడరు తెల్లమతాబా కాల్చివేశాడట.

పంతులికిగల సమస్యలను తర్కించుకొనే శక్తి ప్లీడర్లకేవుంటే బోర్డు దాచుకొనడానికెంతోకాలం పట్టదు. అదేప్రజా సామాన్యాని కంతటికీ అలవడితే మౌనవ్రతానికి ప్రపంచం మంచిరోజు నిశ్చయించుకొనవచ్చు. "ఏమిటీ గొడవంతా!" అని యెప్పుడైనా చొరవజేసుకొని అడిగితే "నీకెలావుందో! గాని, ప్రపంచ పరిస్థితులను చూస్తుంటే నాకు మాత్రం... అని అగి శూన్యంలోకి చూస్తూ పెదవి విరిచి చప్పరించేవాడు. ఒక్కొక్కసారి అడగకుండానే వచ్చి చెప్పేవాడు. "రాత్రికిరాత్రి లేచి దేశాంతరం వెళ్ళాలని కోర్కెకలిగిందోయ్!" అని.

పనికిమాలిన అలోచనలతో బుఱ్ఱ వేడెక్కి భావాలు యెటువంటి వెఱ్ఱి తలలు వేస్తున్నాయో తెలుసుకొనడానికి యింతకన్నా నిదర్శనా లేంకావాలి?

భార్య కాపురానికివచ్చి పట్టుమని పదేళ్ళు నిండలేదు. తనపోషణలో జీవితాన్ని ధన్యంచేసుకోవాలని కన్నులలో ఆశలుపెట్టుకొనివున్నారు తల్లిదండ్రులు.

తానా? పాతికేండ్ల పడుచువయస్సులో వున్నాడు. సి. వి. రామన్ జగదీశచంద్రుడు ఫెరడె న్యూటన్ మొదలైన విఖ్యాత విజ్ఞాన పరిశోధకులను మించిన నిర్విరామ కార్యక్రమంతో అర్థంలేని సిద్ధాంతాలమీద అనవసరమైన ఊహాగానాలుజేసి పంతులు చివరకు సాధించిందిది.

ఏ అవతారపురుషుడైనా ఉద్భవించి, ఏ మహత్తరప్రబోధాలైనా చేస్తే ఏమైనా పరివర్తనం వస్తుందేమో చెప్పలేము. కాని! మానవమాత్రుల వాక్చాతుర్య బలం సిద్ధాంత కథనపాటవం, వివరణా వైశారద్యం మొదలగు విశిష్టగుణ పుంజమంతా పంతులుముందు ఓటమిని అంగీకరించి వెనక్కుతగ్గాయి.

తవకు తానై సర్దుబాటు చేసుకొనలేని, విజ్ఞులు చెబితే వినిపించుకొనలేని కనకయ్యను కదిలించడమే మానివేశారంతా. ప్రజలలో యిలాంటి పరివర్తనమే రావాలని వాంఛిస్తున్నట్లున్న పంతులి కిది శుభకరపరిణామంగానే తోచింది.

పంతులు అలోచిస్తూనే వున్నాడు. కారుమేఘాలు కుంభవృష్టి గురుస్తున్నట్లు నయాగరా జలపాత దూకుతున్నట్లు పంతులు భావాంబరంనుండి అలోచనాధారావాహిని దుముకుతూనే వున్నది.

అయన దొక వింత మనస్తత్వం. ★